# నేడు మర్పల్లికి మంత్రి కేటీఆర్ రాక

## హెలిప్యాడ్ ఏర్పాట్లు చేసిన నాయకులు



మర్పల్లి, నవంబర్ 15 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎమ్మెల్యే ఆనంద్‌కు మద్దతుగా మంత్రి కేటీఆర్ గురువారం మర్పల్లిలో రోడ్ షోలో పాల్గొననున్నట్లు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ప్రభాకర్‌గుప్తా, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, జడ్పీటీసీ మధుకర్, చీమలదరి సర్పంచ్ నర్సింహారెడ్డి తెలిపారు. బుధవారం మర్పల్లిలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ పనులను దగ్గరుండి పూర్తి చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారీ ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొని రోడ్ షోను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు మధుకర్, టౌన్ ప్రెసిడెంట్ గఫార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గౌస్, నాయకులు శ్రీకాంత్, జైపాల్‌రెడ్డి, హుస్సేన్, సురేందర్, శ్రీకాంత్, ప్రవీణ్ పాల్గొన్నారు.




మర్పల్లిలో హెలిప్యాడ్ పనులను పరిశీలిస్తున్న నాయకులు

# జోరుగా.. హుషారుగా..

- మంచిరెడ్డికి రోజురోజుకూ పెరుగుతున్న మద్దతు
- ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మారుతున్న రాజకీయ సమీకరణాలు
- నేడు బీఆర్ఎస్‌లో చేరనున్న కాంగ్రెస్ నేత దండెం రాంరెడ్డి

ఇబ్రహీంపట్నం, నవంబర్ 15 : ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో రాజకీయ సమీకరణలు అత్యంత వేగంగా మారుతున్నాయి. మంచిరెడ్డికి మద్దతుగా వివిధ పార్టీల నుంచి పెద్దఎత్తున బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. దీంతో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మంచిరెడ్డికి మద్దతు క్రమంగా పెరుగుతున్నది. మంచిరెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామాల్లో ఇంటింటికీ ప్రచారం నిర్వహిస్తుండగా, ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తున్నది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇబ్రహీంపట్నంలో ఎన్నికల ప్రచారం నిర్వహించడంతో నాయకుల్లో మరింత జోష్ పెరిగింది. గ్రామాల్లో నాయకులు ఇంటింటికీ ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నించిన దండెం రాంరెడ్డి కూడా మంచిరెడ్డికి మద్దతుగా గురువారం బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. దండెం రాంరెడ్డికి ఒకానొక దశలో కాంగ్రెస్ పార్టీ టికెట్ వస్తుందని పెద్దఎత్తున ప్రచారం కూడా జరిగింది. అందుకనుగుణంగా ఆయన ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం కూడా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులందరికంటే ముందే దండెం రాంరెడ్డి గ్రామాల్లో తానే అభ్యర్థినంటూ పెద్దఎత్తున ప్రచారం కూడా చేశారు. కాంగ్రెస్ అధిష్టానం కూడా ఆయనకు టికెట్ ఇస్తామని ప్రకటించింది. చివరి నిమిషంలో ఆయనకు టికెట్ ఇవ్వకుండా మల్‌రెడ్డి రంగారెడ్డికి ఇచ్చారు. దీంతో ఆయన కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా పోటీకి దిగి.. చివరి నిమిషంలో బుధవారం నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. తనను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలనే ఉద్దేశంతో ఆయన గురువారం కేటీఆర్ సమక్షంలో పార్టీలో చేరడానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. దండెం రాంరెడ్డి బీఆర్ఎస్‌పార్టీలో చేరితే బీఆర్ఎస్ అభ్యర్థి కిషన్‌రెడ్డికి మరింత బలం చేకూరినట్లవుతుంది. మంచాల మండలంలో కూడా కాంగ్రెస్ పార్టీకి బలమైన నేతగా ఉన్న అండెం విష్ణువర్ధన్‌రెడ్డి సీఎం సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆయనతోపాటు మంచాల మాజీ సర్పంచ్ కోట్ల గిరిధర్, సీపీఎం సీనియర్ నాయకులు గంట భిక్షపతి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అనిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, లోయపల్లి సర్పంచ్ బీజేపీ నాయకులు ఎల్లంకి అనితా నర్సింహాగౌడ్ కూడా గులాబీ గూటికి చేరారు. నామినేషన్ల ఉపసంహరణ పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు తమ ప్రచారాన్ని మరింత వేగం పెంచే ఏర్పాట్లు చేస్తున్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మంచిరెడ్డికి మద్దతుగా త్వరలో మరిన్ని చేరికలు ఉంటాయని తెలుస్తున్నది.



ప్రచారంలో దూసుకుపోతున్న ఎమ్మెల్యే అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి తిలకం దిద్దుతున్న సర్పంచ్ పవిత్ర (ఫైల్)

# ఎన్నికల బరిలో 61 మంది

- తాండూరులో 21, వికారాబాద్‌లో 12, పరిగిలో 15, కొడంగల్‌లో 13 మంది అభ్యర్థులు
- నామినేషన్లను ఉపసంహరించుకున్నవారు ఆరుగురు
- తాండూరు నియోజకవర్గంలో రెండు బ్యాలెట్ యూనిట్ల వినియోగం
- జిల్లాలో అందుబాటులో అదనంగా 934 బ్యాలెట్ యూనిట్లు
- నాలుగు నియోజకవర్గాలకు కొత్త ఈవీఎంలు సిద్ధం
- నేటి నుంచి ఓటరు స్లిప్పుల పంపిణీ
- 21 నుంచి 29 వరకు పోస్టల్ బ్యాలెట్
- 28న సా.5 గంటలకు ప్రచారం బంద్
- 30న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్
- ఏర్పాట్లు పూర్తి చేశాం
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నారాయణరెడ్డి





వికారాబాద్, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా నాలుగు నియోజకవర్గాల బరిలో 61 మంది అభ్యర్థులు నిలిచారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పత్రికా విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నామినేషన్ల ఉపసంహరణకు సంబంధించి జిల్లాలో ఆరుగురు నామినేషన్లను ఉపసంహరించుకున్నారని, తాండూరులో నలుగురు, కొడంగల్‌లో ఇద్దరు నామినేషన్లను ఉపసంహరించుకోగా.. తాండూరు నియోజకవర్గంలో 21 మంది, పరిగిలో 15, వికారాబాద్‌లో 12, కొడంగల్‌లో 13 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారని వెల్లడించారు. తాండూరు నియోజకవర్గంలో 15 మందికి మించి అభ్యర్థులున్న దృష్ట్యా తాండూరులోని 269 పోలింగ్ కేంద్రాలకు రెండు బ్యాలెట్ యూనిట్ల చొప్పున సిద్ధం చేస్తున్నామన్నారు. నాలుగు నియోజకవర్గాలకు సరిపోను బ్యాలెట్ పేపర్ల ప్రింటింగ్‌కు సంబంధించి ఇప్పటికే ప్రభుత్వ ప్రింటింగ్ సంస్థకు వివరాలను అందజేశామన్నారు. జిల్లాలో సరిపడా కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వీవీప్యాట్లు అందుబాటులో ఉన్నాయని, అదనంగా 934 ఈవీఎంలను సిద్ధంగా ఉంచామని పేర్కొన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో కొత్త ఈవీఎంలను వినియోగిస్తున్నామన్నారు.

### పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ

మరోవైపు ఎన్నికల విధుల్లో ఉన్న పీవో, ఏపీవో, ఓపీవోలతోపాటు ఇతరులకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్‌ల ప్రక్రియ ఈ నెల 21 నుంచి 29 వరకు ఉంటుందని.. 21, 22, 23 తేదీల్లో పీవో, ఏపీవో, ఓపీవోలకు పోస్టల్ బ్యాలెట్‌లను అందజేయనున్నారని, సంబంధిత పోలింగ్ కేంద్రంలోనే ఓటేసేలా చర్యలు చేపట్టామని కలెక్టర్ పేర్కొన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు ఈ నెల 24న ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో, పోలీసు సిబ్బందితోపాటు ఇతరులకు ఈ నెల 27, 28, 29 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునేలా ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు.

### నియోజకవర్గాలకు చేరుకున్న ఓటరు జాబితా

జిల్లాలో 9,60,376 మంది ఓటర్లుండగా, పురుషులు–4,77,528., మహిళలు–4,82,808., ఇతరులు–40 మంది ఉన్నారని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే ఓటరు జాబితాను నాలుగు నియోజకవర్గాలకు పంపించామని, బూత్ స్థాయి అధికారుల ద్వారా నేటి నుంచి ఓటరు స్లిప్పులను పంపిణీ చేస్తారన్నారు. ఈ నెల 22 వరకు ఓటర్లందరికీ ఓటరు స్లిప్పులను పంపిణీ చేసే ప్రక్రియ పూర్తవుతుందని, ఓటరు స్లిప్పులో ఓటరు వివరాలతోపాటు పోలింగ్ కేంద్రం, లోకేషన్, ఓటు వేసే విధానం ఉంటుందన్నారు. ఇప్పటివరకు ఓటరు స్లిప్పులను 966 పోలింగ్ కేంద్రాలకు పంపించామని.. మిగతా పోలింగ్ కేంద్రాలకు రేపటిలోగా అందజేస్తామన్నారు. దివ్యాంగ ఓటర్లకు సంబంధించి 150 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారి లోకేషన్ ఆధారంగా ఈ నెల 23, 24 తేదీల్లో పోలింగ్ సిబ్బంది వారి ఇంటికెళ్లి ఓటేయించనున్నారు. అత్యవసర సర్వీసు ఉద్యోగులకు సంబంధించి 150 మంది దరఖాస్తు చేసుకున్నారని.. వీరికి ఆయా ఆర్వో కేంద్రాల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ వెల్లడించారు.

### ఎన్నికల కోడ్ పకడ్బందీగా అమలు

జిల్లాలో ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేస్తున్నామని, ఆయా పార్టీల అభ్యర్థులు తప్పనిసరిగా ఎన్నికల నిబంధనలను పాటిస్తూ ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఇప్పటివరకు జిల్లాలో తనిఖీల్లో భాగంగా 2.89 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారని, వీటిలో సరైన పత్రాలు చూపించిన రూ.2.25 కోట్లను తిరిగి బాధితులకు అందజేశామన్నారు.

### బాధ్యతగా ఓటు హక్కు వినియోగించుకోవాలి


ఈ నెల 30న పోలింగ్ జరగనున్న దృష్ట్యా పోలింగ్‌కు 48 గంటల ముందు ప్రచారం ముగించాలని.. అంటే ఈ నెల 28న సాయంత్రం 5 గంటలకు ప్రచారం ఆయా పార్టీల అభ్యర్థులు ముగించాల్సి ఉంటుందని కలెక్టర్ సూచించారు. ఈ నెల 30న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుందని, ఈ నెల 29న సాయంత్రం ఆయా పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను పోలీస్ బందోబస్తు నడుమ తరలిస్తామన్నారు. పోలింగ్ అనంతరం పోలింగ్ కేంద్రాల నుంచి ఆయా నియోజకవర్గ కేంద్రాల్లోని స్ట్రాంగ్‌రూంలకు, అక్కడి నుంచి ఓట్ల లెక్కింపు కేంద్రానికి తరలించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామని కలెక్టర్ వెల్లడించారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగరాదన్నారు. వచ్చే ఐదేండ్లకు కావాల్సిన నాయకుడిని ఎన్నుకుంటారు కాబట్టి ప్రతిఒక్కరూ బాధ్యతగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.

## పాలమూరు-రంగారెడ్డిపై..

# కాంగ్రెస్ రాజకీయం

### విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి నాగేందర్‌గౌడ్

గండీడ్, నవంబర్ 15 : పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేస్తున్నదని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి నాగేందర్ గౌడ్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పాలమూరు-రంగారెడ్డి పథకంపై మంత్రి కేటీఆర్ కులకచర్ల రోడ్డు షోలో స్పష్టంగా తెలియజేశారని చెప్పారు. దీనిపై మళ్లీమళ్లీ రాజకీయం చేసే ప్రయత్నం సరైంది కాదన్నారు. ప్రాణహిత-చేవెళ్ల పథకం కేవలం ఫౌండేషన్‌లకే పరిమితమైన సమైక్య రాష్ట్రంలో మొబిలైజేషన్‌తో కోటీ64లక్షల రూపాయలను మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ రాజశేఖర్‌రెడ్డి ఎన్నికల్లో వాడుకున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. పాలమూరు-రంగారెడ్డిని తీసుకువచ్చి ప్రథమంగా పరిగికి నీళ్లందించడం జరుగుతుందన్నారు. ఈ ఎన్నికల్లో రామ్మోహన్‌రెడ్డికి డిపాజిట్ దక్కకున్నా పాలమూరు-రంగారెడ్డికి మళ్లీ ఆటంకం కలిగిస్తారని అన్నారు. రైళ్లు అన్నారు.. ప్రాజెక్టులు అన్నారు.. ఏ ఒక్క అభివృద్ధి పని కూడా సక్రమంగా నెరవేర్చని కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మలేని స్థితిలో ఉన్నారన్నారు. ఉద్యమ కుటుంబం నుంచి వచ్చిన కొప్పుల మహేశ్‌రెడ్డితోనే నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. మహేశ్‌రెడ్డిని మరోసారి భారీ మెజార్టీతో గెలిపిస్తే పరిగి తాలుకాను మరింత అభివృద్ధి చేసుకోవచ్చని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి ప్రతిమారెడ్డి, ఎంపీపీ మాధవి, జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచులు చంద్రకళ, వనజ, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు గోపాల్, డైరెక్టర్లు రవీందర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, మాజీ జడ్పీటీసీ లక్ష్మమ్మ, నంచర్ల మాజీ ఎంపీటీసీ సువర్ణ, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెంట్యానాయక్, సీనియర్ నాయకులు లక్ష్మి, గోపాల్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, కృష్ణ, వెంకటేశ్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి నాగేందర్‌గౌడ్

# సమాజానికి గమ్యాన్ని నిర్దేశించే రచనలు రావాలి

తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 15 : సమాజానికి గమ్యాన్ని నిర్దేశించే రచనలు రావాలని మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ సాహితీవేత్తలకు సూచించారు. తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో పది మంది ఉత్తమ గ్రంథ రచయితలకు 2021 సంవత్సరానికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారాలను వర్సిటీలోని ఆడిటోరియంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ప్రదానం చేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాహితీవేత్తలకు పురస్కారాలను తెలుగు యూనివర్సిటీ అందజేయడం అభినందనీయమన్నారు. తెలుగు వర్సిటీ ఉపాధ్యక్షుడు కిషన్‌రావు ప్రసంగిస్తూ.. తెలుగు భాష, సంస్కృతి, సాహిత్యంలో ఉత్తమ రచనలను సమాజానికి అందిస్తున్న రచయితలను ప్రోత్సహించడానికి వర్సిటీ కృషి చేస్తున్నదన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేశ్, విస్తరణ సేవా విభాగం ఇన్‌చార్జి రామ్మూర్తి పాల్గొని పురస్కార గ్రహీతల విశిష్టతను కొనియాడారు.

పురస్కారాలను పద్య కవితా ప్రక్రియలో డాక్టర్ మాడ్గుల అనిల్‌కుమార్ (శ్రీగిరిజా కల్యాణం), వచన కవితా ప్రక్రియలో తండ హరీశ్ గౌడ్(ఇన్ బాక్స్), బాల సాహిత్యంలో మాచిరాజు కామేశ్వరరావు (పాపిష్టి డబ్బు), కథానిక ప్రక్రియలో అల్లాడి శ్రీనివాస్ (ఎడారి పూలు), నవలా ప్రక్రియలో అట్టాడ అప్పలనాయుడు (బహుళ), సాహిత్య విమర్శలో కె.పి.అశోక్‌కుమార్ (తెలుగు నవల–ప్రయోగ వైవిధ్యం), నాటకం ప్రక్రియలో ఎస్.డి.వి. అజీజ్ (తురేబాజ్ ఖాన్), అనువాద సాహిత్యంలో స్వర్ణ కిలారి రచన (లిప్తకాలపు స్వప్నం), వచన రచనల విభాగంలో కోడం పవన్‌కుమార్ (కరోనా@ లాక్‌డౌన్. 360), రచయిత్రి ఉత్తమ గ్రంథ విభాగంలో విజయ భండారు(గణిక), పలువురు గ్రంథ రచయితలకు సాహితీ పురస్కారాలను ప్రదానం చేశారు. పురస్కారం కింద ఒక్కొక్కరికి రూ.20,116 నగదు, జ్ఞాపికలను అందజేశారు.